

# అమల సబేషిణి ఆల్ఫోన్స్-కొడైక్కాణల్

భానుకిరణ్

నేను ఎక్కడ పుట్టిందీ నాకు తెలీదు కాని, నాకు ఊహ వచ్చేసరికి మేము సిలోను ఉత్తరాన తమిళ ఈళంలోని జాఫ్నా దగ్గర వేల్ వెట్టిదురై అనే గ్రామంలో ఉండేవాళ్లం.

అమ్మ మాతోనే ఉండేవారు కాని నాన్న ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తుండేవాడు. నాన్నని గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటుండేవాళ్లు. కాని నాన్న ఏం చేస్తుందీ నాకు మొదట్లో అర్థమయ్యేదే కాదసలు!

మాతోపాటే సెల్వీ పిన్ని, కరుణ మామ, చిన్ని ఇన్బచెల్వి ఉండేవాళ్లు. అందరం ఒకే ఇంట్లో వుంటుండేవాళ్లం. ప్రతి కొన్ని నెలలకి ఒకసారి మా ఇళ్లు మారిపోవటం బాగా జ్ఞాపకం. ఎన్ని ఊళ్లు మారినా కూడా అన్నిచోట్లా సముద్రం ఒకేలాగ కనిపిస్తుండేది. అందుకనే ఆ ప్రాంతం గురించి ఆలోచించినప్పుడు అక్కడి నేల కంటే అక్కడి సముద్రం, ఉప్పు గాలి బాగా గుర్తుకొస్తాయి. పూసలకి గుచ్చిన దారాలలాగ అక్కడి ప్రకృతికి మేము గుచ్చబడ్డామనే అర్థం వచ్చే పాటలు పాడుకుంటుండేవాళ్లం.

కొత్త ప్రదేశంలోకి మారగానే నేనూ, ఇన్బచెల్వీ అక్కడ చుట్టు పక్కల ప్రదేశాలు వెతకటం, కొత్తకొత్త చెట్లు, కొండ గుట్టలు కనిపెట్టడం ఒక బాధ్యతగా భావించేవాళ్లం. కొత్త చెట్లూ, ముందెన్నడూ చూడని గింజలూ, రంగు రాళ్లూ, గవ్వలూ ఏరుకోవటం ఉదయం లేవగానే మేము చేసే మొదటిపని. ఇన్బ చెల్విని నేను అమితంగా ప్రేమించేదాన్ని. దానికీ నేనంటే పిచ్చిప్రేమ ఉండేది. మేం ఆకతాయిగా కూడా కొట్లాడు కోవటం నాకు గుర్తులేదు. దాని నవ్వు ఎంత అందంగా ఉండేదో! నల్లటి ముఖం, తెల్లటి పళ్లు, మెరిసే పెద్ద కళ్లు... అది నవ్వితే నాకూ నవ్వు ఆగేది కాదు. మేము పెద్దయేకొద్దీ మా మధ్యన ప్రేమ మరింత గాఢమైంది. నిమిషం ఖాళీగా ఉండేవాళ్లం కాదు. స్నానం కూడా కలిసే చేసేవాళ్లం.

ఊరికి దూరంగా ఉండే గడ్డికొండలూ, రాళ్లని తాకే సముద్రాలూ ఉండే ప్రదేశాల్లో మేము బట్టలు లేకుండా ఆడుకొనేవాళ్లం. ఎవరైనా చూస్తున్నారన్న భయం మాకు మరింత ఉత్తేజాన్ని కలిగించేది. ఇన్బ చెల్వి బట్టలు తీయగానే మొదట సిగ్గుపడి నవ్వేసేది. నేను ముద్దిచ్చేదాన్ని... సిగ్గుతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని కిచకిచా నవ్వేస్కొనేవాళ్లం. ఇవేమీ ఎవరికీ తెలియవు... మా ఇద్దరికీ తప్ప.

ఒక్కోసారి అలసిపోయి మధ్యాహ్నాలు ఒకరిని ఆనుకొని ఒకరు ఒత్తిగిల్లి పడుకొని సూర్యాస్తమయం అయ్యేదాక అలానే ఉండిపోయేవాళ్లం. నేను నిద్ర పోతున్నాననుకొని నా బుగ్గల మీద, పెదవుల మీద, మెడ మీద ముద్దులు పెట్టేది. నేను తెలియనట్టు నిద్ర నటిస్తూనే ఉండేదాన్ని. మా ఇద్దరి మధ్య ఇదొక రహస్యం! ఇద్దరం రోజంతా సముద్రపు ఒడ్డున పోగేసిన రాళ్లని ఏ రహస్య గుహల్లోనో దాచేసేవాళ్లం. రోజూ వాటిని లెక్కపెట్టుకొనేవాళ్లం.

అక్కడి నేలకీ, నీళ్లకీ, చెట్లకీ, గాలికీ అలవాటు పడి, వ్యవసాయం కుదిరి, కుటుంబాలకి జీవితం ఆశా జనకం అవుతుండగానే ఊరిలో అలజడి అవుతుంది. తుపాకులవాళ్లు వచ్చి మమ్మల్ని వేరే ప్రాంతానికి తర లించేవాళ్లు. ఇలాంటి అలజడి సమయాల్లోనే నాన్న వచ్చి వెళ్తుండేవాడు. అమ్మ ఆ ఒక్కరోజూ ఎంతో హడా విడి పడేది. మమ్మల్ని పట్టించుకునేది కాదు. రాత్రికి

రాత్రి వేరే ప్రాంతానికి ఊరు ఊరంతా నడుచుకుంటూ బయలుదేరాలని 'అన్న' ఆజ్ఞని మాకు తెలియజేసే వాళ్లు. ఎవరికీ ఏ సందేహాలు ఉండేవికావు. ఎవరూ ఏమీ అడిగేవాళ్లు కాదు. ప్రపంచంలో అందరూ ప్రాణాలు కాపాడుకోవటం కోసం ఇలానే ఊళ్లు తిరుగు తారు కాబోలు అనుకొనేవాళ్లం. కొంతమందిలో తమిళ పులుల చర్యల పట్ల అసంతృప్తి ఉండేది. కాని అందరికీ వాళ్ల మీద అపారమైన గౌరవం కూడా ఉండేది.

మా వయసు పన్నెండు ఉన్నప్పుడు మేము 'తుంపళై'లో ఉండేవాళ్లం. ఒకరోజు హఠాత్తుగా ఏదో పెద్ద విపత్తు వచ్చింది. పెద్దపెద్ద శబ్దాలతో ఊరంతా మోతెక్కిపోయింది. పై నుంచి విమానాలు మా ఇళ్ల మీద బాంబులు వేసేస్తున్నాయి. అందరం ఇళ్ల బయ టికి వచ్చేసి పరిగెడుతున్నాము. కొందరు పరిగెట్టలేక పడిపోయి చనిపోయారు. కొందరు నొప్పితో అరుస్తు న్నారు. కొందరు ఇళ్లలోనే తలుపులు మూసుకొని ఉండి పోయారు. అలా ఉండిపోయినవాళ్లు తరువాత సింహళ సైన్యానికి చిక్కి నరక యాతన అనుభవించిన కథలు మేము ఎన్నో విన్నాము. గుంపుకి దూరమవట మనే మాట తలుచుకుంటేనే గుబులు పుట్టేది.

మమ్మల్నందరిని సామానులు సర్దుకొని రాత్రి కల్లా ప్రయాణానికి సిద్ధం కమ్మని మైకుల్లో ఆదేశం విని పించింది. సమయం గడిచేకొద్దీ బాంబుల శబ్దాలు, కాల్పుల శబ్దాలు మరింత ఉధృతం అయ్యాయి. తెలిసిన గొంతులే, ఒకప్పుడు విన్న గొంతులే అరవటం, చావుకేకలు పెట్టడం వినిపించింది. అంతా ఒకటే అవ్యవస్థ. పాకలు విప్పేసి ఆ ఆకుల్ని బళ్ల మీద తీసుకు పోయేవాళ్లం. పాక విప్పేశాక చూస్తే ఆ ప్రదేశమంతా కొత్తగా ఉండేది. అన్ని రోజులు అక్కడే బతికామా? అన్న సందేహం వచ్చేది. ఆరోజు సాయంత్రం సూర్యుడు ఉండగానే ప్రయాణం మొదలైంది. పిన్ని, మామ, అమ్మ మాతో సగం దూరం నడిచి వచ్చారు.

రాత్రికి ఇన్బచెల్వి, నేను ఒక ఎడ్లబండిలో కూర్చో డానికి చోటు సంపాదించుకున్నాము. చేతులు గట్టిగా పట్టుకొని పడుకొనిపోయాము.

ప్రయాణం రెండు రోజులు సాగింది. ఆకలికి అరకొర తిండి ఇచ్చేవారు. కొత్త ఊరి పేరు 'కట్‌కోవళం.' అక్కడివాళ్లు మమ్మల్ని అభిమానంతో ఆదరించారు. కొన్ని నెలలు బాగానే సాగింది. పిల్లలందరికీ సాయం కాలం పాటలు పాడటం నేర్పించేవాళ్లు. మాకు ఆ పాటలు నేర్చుకోవటం, పాడటం అంటే ఎంతో సరదాగా ఉండేది. రాత్రి అవి పాడుకుంటూనే ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీకుండా పడుకొనేవాళ్లం.

ఇంకా రాత్రులు మాకోసం యోధులు ఎట్లా యుద్ధంలో పోరాడుతుందీ సినిమాలు వేసి చూపించే వాళ్లు. త్వరలో ఈళంలో శాంతి ఏర్పడుతుందని, పౌరులు అంతా అందుకు శ్రమించాలనీ చెప్పేవాళ్లు. అక్కడి చర్చివాళ్లు కూడా మాకు ప్రార్థన పాటలతో పాటు ఎన్నో విషయాలు నేర్పేవాళ్లు. తమిళం రాయటం, చదవటం అక్కడే నేను నేర్చుకున్నాను.

ఒకరోజు ఇన్బచెల్వి వాళ్ల అన్న హఠాత్తుగా ఊడి పడి చెల్విని బడిలో వేయాలని పంతం పట్టాడు. ఆ అన్న యుద్ధంలో పనిచేసేవాడు. అతని మాటకి ఎవరూ ఎదురు చెప్పలేదు. మా ఇద్దరికీ ఒకర్నొకరం వదులు కోవాలంటే ప్రాణం పోయే పరిస్థితి- పుట్టినప్పటి నుంచి మేము ఒకరిని ఒకరం విడిచిపెట్టిందే లేదు. నేను కూడా వస్తానంటే తీసుకుపోతానన్నాడు అన్న.

కాని అమ్మ నన్ను పంపనని పట్టుపట్టింది. ఆవిడకి జరుగుతున్న పోరాటం మీద తీవ్ర అసంతృప్తి ఉండేది. నాన్న కోసం ఆవిడ ఆ దేశాన్ని వదిలిపెట్టే ఆలోచన చెయ్యలేదు కాని, లేకుంటే ఆవిడకి ప్రశాంత జీవితం మీద చాలా కోరిక ఉండేది.

అడ్డు ఆపు లేకుండా ఏడవటం తప్పిస్తే ఇన్బ చెల్విని ఆపుకోలేకపోయాను. అమ్మ కూడా చాలా బాధ పడింది. మళ్లీ చెల్విని చూడలేమన్నట్టుగా మాట్లాడింది. ఒక్కరోజులోనే అన్నీ జరిగిపోయాయి. చివరిసారి చెల్వి నాతో, "నీకొకటి చెప్పాలి..." అని ఏదో రహస్యం చెప్ప బోతున్నట్టు అంది. కాని తరువాత మమ్మల్ని మాట్లాడు కోనివ్వలేదు. కళ్లెదురుగా అన్న బండిలో తీసుకుపో తున్నా... చెల్వి నన్ను వదిలివెళ్తుందంటే నమ్మకం కలగ లేదు. ఇంట్లోకి రాంగానే ఏ తలుపు వెనకాలో దాక్కొని 'భూ...!!' అని భయపెడుతుందేమో అనిపించింది. చాలాకాలం ఇలాంటి భ్రమలోనే ఉండిపోయాను. కాని చెల్విని చూడటం అదే ఆఖరిసారి అయింది.

ఆ తరువాత నా జీవితంలో నా గురించి తెలిసిన వాళ్లు కానీ, తెలుసుకోవాలనుకునే వాళ్లుకానీ, నన్ను ప్రేమగా పలకరించేవాళ్లు కానీ నాకు పరిచయం కాలేదు. చెల్విని వదులుకున్న తరువాత జీవితంలో ఆకస్మిక మార్పులు ఎన్నో చోటు చేసుకున్నాయి. గ్రామంలోని మగపిల్లలు నా చుట్టూ చేరటం మొద లైంది. అప్పట్లో అది కొత్తగా సరదాగా అనిపించేది. అమ్మ ఈ విషయం మీద నన్ను ఒకటి రెండుసార్లు

వారించడం నాకు గుర్తుంది. అప్పటికి అమ్మ కొబ్బరి పీచు తీసే పని చేసేది. నిత్యం ఏదో ఆలోచిస్తూ వుండేది. రోజూ నేను పాటలు నేర్చుకోవటం, బట్టలు వుతకడం మినహాయిస్తే ప్రత్యేకించి ఏం జరిగేది కాదు. చర్చి నుంచి వచ్చే దారిలో ఒకతను నాకోసం ఎదురు చూస్తూ ఉండేవాడు. అతన్ని చూసి ఎప్పటికైనా ఒకసారి నవ్వాలనుకునేదాన్ని.

ఈళం చాలా అందమైన దేశం. కాని అక్కడ జీవితాలు ఎంత దుర్భరమో అక్కడి వారికన్నా ఈళాన్ని వదిలివెళ్లిన వారికి బాగా తెలుస్తుంది. యుద్ధంలో వీర మరణం పొందిన వాళ్ల శవాలను అందరికీ కనిపించేలా గ్రామమంతా ఊరేగిస్తారు. అలా ఎన్ని శవాలు చూశావో లెక్కలేదు. అందులో కొన్ని తెలిసిన ముఖాలు కూడా ఉండేవి. అవి చూసి ఉలిక్కిపడేదాన్ని. ఆ రోజంతా తిండి సహించేది కాదు. అక్కడే వుండి వుంటే ఏరోజో నా ఇన్బచెల్విని కూడా అలానే చూసే దాన్నేమో! ఆ బుజ్జిదానికి ఏం తెలుసూ యుద్ధం చెయ్యటం?

ఈళం నుంచి తప్పించుకునేందుకు సముద్రం లో చావటానికైనా సిద్ధపడేవారికి ఓడల్లో ఏదో ఒక దేశానికి వలస వెళ్లి అక్కడ వాళ్ల శరణు కోరి కూలీలుగా స్థిరపడే అవకాశం ఉంది. అలా వెళ్లినవారు డబ్బు సంపాదించి యుద్ధానికి ధనసహాయం చేస్తారని చెప్తారు. అలా వచ్చిన కొన్ని ఓడలు 'పూనరిణ్'లో నిలిపి ఉంచా రనీ, పిన్నీ వాళ్లు వెళ్తున్నారనీ, నేను కూడా వాళ్లతో వెళ్లా లనీ అమ్మ నాతో చెప్పింది. నేను వెళ్లననలేదు. ఎందు కని అడగొద్దు దయచేసి! అమ్మ మాత్రం నాతో రానన్నది. అనుకోకుండా నాన్న ఇంటికి వచ్చినప్పుడు ఒకసారి అమ్మానాన్న చాలాసేపు ఈ విషయమే చర్చిం చారని తెలిసింది.

ఈళం నుంచి బయటపడి నేనైనా సుఖంగా ఉంటాననుకున్నదనిపించింది అమ్మ. ఎవరి బలవంతం లేకపోయినా ఎవరో బలవంతం చేస్తున్నట్టే ఈళాన్ని వదిలి వెళ్లటానికి ఒప్పుకున్నాను. ప్రయాణానికి రెండు రోజులు గడువుందని చెప్పారు.

ఓడలో తోటివారంతా ఒకటే ఏడుపులు. అక్కడ ఏడవకుండా శిలావిగ్రహంలా కూర్చుంది నేనొక్కదాన్నే. గతమంతా కళ్ల ముందు కదులుతోంది. ఇన్బచెల్వి, నేను ఏ గుహలో ఏఏ రాళ్లు ఉంచామో నాకు గుర్తుంది. ఒడ్డుమీది కొబ్బరిచెట్లు దూరమైపోతున్నాయి. గంటలు గడిచేకొద్దీ ఈళం తీరం దూరమైపోతూ... చిన్నదైపోతూ... చివరికి కనిపించకుండాపోయింది.

అంతవరకు నేను ఈళాన్ని శాశ్వతంగా వదిలి వెళ్తున్నానన్న భావన కలగలేదు నాకు. ఒక్కసారిగా గుండెల్లోన ఏదో భయం. ఎటు పోతున్నాను? ఎందుకు పోతున్నాను? అమ్మ లేదేమి పక్కన?! నన్ను ఎందుకు పంపేసింది? నేనెందుకు ఏం మాట్లాడకుండా వచ్చే శాను? నన్ను అమ్మ దగ్గరికి పంపేస్తే ఎంత బాగుండు. ఒక్కసారి ఈళం చూడాలి... చెల్వి యుద్ధంలో చని పోదు... బతికి వచ్చి నా కోసం వెతుకుతుంది. అది నాకు చెప్పాలనుకున్న రహస్యం వినకుండా ఎటు పోతు న్నాను...

ఈ క్షణమే ఇంటికి వచ్చి అమ్మని అడుగుతుం దేమో, 'అమల ఎక్కడా... అమల ఎక్కడా?' అని. నన్ను వెనక్కి తీసుకుపొండి... నేనూ యుద్ధంలో చేర తాను. అమ్మ మాట వినను. యుద్ధంలో చేరతాను... ఈళం కోసం వీరమరణమైనా పొందుతాను... నన్ను పంపే యండి... ఎక్కడికి తీసుకుపోతున్నారు? ఎక్కడికి వెళు తుంది ఈ ఓడ? ఏ దేశం? అక్కడ శాంతి వుంటుందా? అక్కడ నేనేం చేస్తాను? నన్ను పోనివ్వండి... ఇన్బచెల్వి ఇంకా బతికుంటే... నేను మళ్లా కలిస్తే వీటన్నిటి గురించి చెప్పాలి కదా.

సముద్రంలో ప్రయాణం చాలాసేపు సాగింది. చీకటి పడగానే అమ్మ మరింతగా గుర్తొచ్చి వెక్కివెక్కి ఏడ్చాను. ఓడలో అందరూ ఏడ్చేవాళ్లమే! కొన్ని వారాల ప్రయాణం ముగిసి ఇండియా చేరుకునేసరికి మాలో ఎక్కువమందిమి బ్రతికే ఉన్నాం.

ఆరోజు ఇవన్నీ మీ దగ్గర దాచేసి ఏవేవో అబద్ధాలు చెప్పేసాను. మీ కాగితాలు, మాట తీరూ, ప్రశ్నలూ చూసి మీరు పోలీసేమో అని భయపడ్డాను. మీరె దురుగా ఉన్నంతసేపు కాళ్లూ చేతులూ ఆడలేదు. పోలీసులతో మాకు చాలా భయముంది. అందుకనే అలా భయపడ్డాను. మీరు వెళ్లిపోయాక మా 'హౌసు'లో కొజ్జాలు మాట్లాడుకుంటుంటే విన్నాను, మీరు పోలీసు కాదని, ఒక రచయిత అని. మీవంటి వారికి అబద్ధాలు చెప్పినందుకు బాధపడ్డాను. మీరు మీ అడ్రస్సు ఇచ్చా రని గుర్తొచ్చి చాలాసార్లు వద్దనుకొని చివరికి నిశ్చ యించుకుని ఇది రాస్తున్నాను.

ఆ విధంగా ఇండియా చేరిన తరువాత పిన్ని వాళ్లు నాకు మళ్లీ కనిపించలేదు. నన్ను నా వయసు వాళ్లు ఉన్న ఆడపిల్లల సత్రంలో ఉంచారు. అంత దూరం ప్రయాణం చేసినా కూడా పెద్ద కొత్త అనిపించ

లేదు ఈ దేశం నాకు. ఇండియాలో అందరూ మా భాషే మాట్లాడ్డం ఆశ్చర్యం అనిపించింది. ఇక్కడ జీవితం ఇంత ప్రశాంతంగా ఉండబట్టే అన్ని కష్టాలు పడైనా ఈళం నుండి వలస వస్తున్నారనుకున్నాను. సత్రంలో కొత్తవాళ్లని కలుసుకున్నాను. అక్కడ మంచి భోజనం పెట్టేవారు. రోజంతా ఖాళీగా ఒక గదిలో కూర్చొని ఉండేదాన్ని. ఒక సాయంత్రం చీకటిపడ్డ తర్వాత నన్నూ, ఇంకా ఇద్దరు అమ్మాయిల్ని సత్రం వెనక ద్వారం గుండా రహస్యంగా వేరే ఊరికి తరలించారు.

అప్పుడే మొదటిసారి ట్రైన్ ఎక్కాను. అది చాలా అందమైన ఊరు. పేరు అడిగితే చెప్పలేదు. అక్కడ ఒక హౌస్‌లో మమ్మల్ని కొన్ని రోజులు ఉంచారు. ఏవో మందులు ఇచ్చి వేసుకోమనేవారు. వాటిని మింగేవరకు ఎదురుగా నిలబడి చూసేవాళ్లు. ఎవరో తెలియని మగవాళ్లని మా గదుల్లోకి పంపించేవాళ్లు. ఇంకా గదిలో జరిగేదంతా వీడియో కెమెరాల్లో రికార్డ్ చేసేవాళ్లు.

మొదట్లో ఈ పని అంతా ఇబ్బందిగా ఉండేది... మరీ ఎవరో తెలియనివాళ్లు అంత దగ్గరగా వచ్చి వళ్లంతా ముట్టుకొని చేస్తుంటే.

కాని తరువాత కొన్నాళ్లకు బాగుండింది. కొంత మంది మగవాళ్లు నేను గొప్ప సుఖాన్నిస్తున్నానని నన్ను మరింత మెచ్చుకొని వాళ్ల ఇళ్లకు కూడా తీసుకొని వెళ్లేవారు. బోల్డన్ని బహుమతులు, చీరలు ఇచ్చేవారు. రెండు సంవత్సరాలు ఆ హౌసులో ఉన్నాక ఇక్కడ కోడైక్యానల్‌కి నన్ను తీసుకొచ్చారు. ఇక్కడి వాతావరణం చాలా బాగుందనిపించింది. కాకపోతే ఒంటరిగా ఉండే వీలు చాలా తక్కువ ఉంటుంది. ఎప్పుడూ ఎవరో ఒకరు నా దగ్గరికి వచ్చి వెళ్తూనే ఉంటారు. కొంతమంది రోజంతా వదిలిపెట్టరు.

నిజానికి మీరు ఒక రెండు రోజుల ముందు వచ్చుండుంటే నన్ను కలిసుండేవారు కాదు. మొదట వేరేచోట ఉండేదాన్ని. అక్కడ నచ్చక మేడంని అడిగి ఇక్కడికి వచ్చాను.

ఆరోజు పచ్చి అబద్ధాలు చెప్పాను మీకు. మీరన్నట్టు నా వయసు నిజానికి పంతొమ్మిదే! నేను అబద్ధాలాడుతున్నానని కనిపెట్టే, నేను ఉత్తరం రాస్తానని తెలిసే అడ్రస్సు ఇచ్చారా? ఎవరైనా ఎక్కువ ప్రశ్నలు అడిగితే మాటలు మళ్లించమని మాకు చెప్తుంటారు... మీరేమో మరీ దూరంగా కూర్చున్నారు...

అదీగాక మిమ్మల్ని చూస్తేనే ఏదో భయం అయిపోయింది నాకు. కాని మీరు వెళ్లిపోయాక మీ గురించి చాలాసేపు ఆలోచించాను. మీ ప్రశ్నలూ, మాటలూ చాలా తెలివిగా అనిపించాయి. రచయిత అంటే మీరు పాటలు రాస్తారా? మీరు చాలా అందగాళ్లు. మీ మీసం, విశాలమైన భుజాలు, మీ పొడవు, మీ గొంతు అన్నీ నాకు చాలా నచ్చాయి. మీ నవ్వు నాకింకా గుర్తుంది. మిమ్మల్ని మళ్లీ చూడాలని ఉంది. ఈసారి బెదిరిపోను. డబ్బులు అడగను... అస్సలు అబద్ధాలాడను... మళ్లీ కోడైక్యానల్ ఎప్పుడొస్తున్నారు? నా పేరు గుర్తుంది కదా... అమల సభేషిని. అదే హౌసులో అడగండి. మీరొస్తే మీరున్నంత కాలం మీతోనే వుంటాను. మేడం నా మాట కాదనరు. ఇలా ఉత్తరాలు రాస్తున్నారంటే కోపగించుకుంటారనుకోండి.

మీరిచ్చిన చాక్లెట్లు చాలా బాగున్నాయి. ఇప్పటికీ దాచుకొని రోజుకొకటి తింటున్నాను.

చివరిగా ఒక ప్రశ్న... ఇలా అడుగుతున్నానని వేరేలా అనుకోకండి...

మీరు నన్ను ప్రేమించారా?

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 7 జూన్ 2009*

